పిన్నలు : పెద్దలు

శ్రీ కొండముది శ్రీరామచంద్రమూర్తి

కొంలీ కదలకుండా కదులుతున్నాయి చెట్ల ఆకులు.

ఒడ్డును తాకీతాకకుండా వెనక్కి మరలుతున్నాయి ఆ చెఱువులోని చిరు కెరటాలు.

గోపీ ఇదేమీ గమనించకుండా, గట్టునున్న ఓ బండపై కూర్చొని శూన్యంలోకి తదేకంగా చూస్తున్నాడు.

సాయంకాలపు నీరెండలో అసలే ఎఱ్ఱనైన అతని శరీరం మరింత ఎఱ్ఱగా మెఱిసిపోతోంది. దువ్వుకోని అతని చింపిరిజుట్టు మొగంమీదకుపడి మరింత నల్లగా కన్పిస్తోంది.

నీళ్ళకొచ్చిన ఒకరిద్దరు అమ్మలక్కలు అతని దగ్గరకొచ్చి పరకాయించి చూసి మరీ వెళ్ళారు. దూరంగా ఒక పెయ్యదూడను మొరాయిస్తున్నా లెక్కట్టకుండా మెడకు తాడోసి ఇంటికి లాక్కెళ్తున్నాడో సన్నకారు రైతు.

ఇదేమీ గోపీ గమనించటల్లేదు. శూన్యంలోకి తీక్షణమైన తన దృక్కులు బఱపుతూ జేనినిగూర్చి తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

"మాష్టరుగారిమీద తన కసి ఎలా తీర్తుంది?" దీనికి సమాధానం తోచీతోచకుండా వుందతని చిన్న మెదడుకు.

ఒక ఆలోచన కలిగీ కలగకుండానే వేరొక ఆలోచన అతనికి ప్రత్యక్షమౌతోంది.

"మాష్టరుగారికో నాలుగేళ్ల అబ్బాయి వున్నాడు. ఆ అబ్బాయిని పట్టుకు చితక్కొడ్తే! ఛా—అది పిరికితనంకదూ? ఎవరో ఆర్నెల్లు సాము చేసి మూలనున్న ముసలమ్మమీద తన బలం చూపించాడట! తను అంత పెద్ద వాడైవుండి ఒక చిన్న పిల్లవాడి మీద పౌరుషం చూపించటమా?"

సిగ్గుతో తల దించుకున్నాడు గోపీ.

ఎవరో ఒక పెద్దాయన చిన్న పిల్లాణ్ణొకణ్ణి చేత్తో పుచ్చుకుని షికారు వెళ్తున్నాడు. ఆ పిల్లాడు ఎంచక్కా గంతులేస్తూ ఆ పెద్దాయనవెంట నడుస్తున్నాడు!

వారిద్దరూ కనుమాపు మేర దాటేవరకూ అట్టే చూస్తూంపోయాడు గోపీ!

అతనిలో లీలగా ఒక దరహాసం గోచరించింది. రేఖామాత్రంగా పాతరోజులు జ్ఞాపకం వచ్చినందుకు తనలో తనే ఆనందపడ్డాడు అతను.

"తనను చిన్నతనంలో ఎత్తుకొని తప్ప షికారుకు తీసుకువెళ్ళేవారుకాదు నాన్నగారు. మరి ఈ అబ్బాయినో? పాపం—నడిపించుకు వెళ్తున్నాడా పెద్దమనిషి!"

బెస్తవాడొకడు అప్పుడేవచ్చి గాలమేసి కూర్చున్నాడు.

గోపీ బెస్తవాడివేపు చూశాడు. వాడి వంటిమీద గోచీతప్ప మరే గుడ్డపేలికా లేదు.

తనవేపు చూసుకున్నాడు గోపీ. చినిగిందైనా తనకో లాగూవుంది. బుజాలమీద అతుకులున్నా మాంచి చొక్కా వుంది.

ఇంకేం? బెస్తవాడికి లేనివి తనకున్నాయి.

ఇదివరలో వాళ్ళక్కయ్య చెప్పిన మాట వొకటి జ్ఞాపకం వచ్చింది గోపీకి—'ఒకడికన్న ఇంకొకడు గొప్పవాడవడానికి కారణం ఒకడికి లేని వస్తువును వేరొకడు కల్గి వుండడమేనట!'—

"అయితే తను ఆ గాలంఅతనికన్న చాలా గొప్పవాడన్నమాట! మరి గొప్పవాళ్ళు తక్కువ వాళ్ల దగ్గరనుంచి ఏదిబడితే అది తీసుకోవచ్చుగా! తను కూడా ఆ గాలంఆయన దగ్గర అది పుచ్చుకోవచ్చునా?"

—బెస్తవాడి ప్రక్కనున్న చేపల బుట్టల్లోంచి చిన్నరకం చేపలు రెండు బయట పడడానికి ఎగిరెగిరి ప్రయత్నిస్తున్నాయి.

అబ్బ ఎంత బావున్నాయి అవ్వీ?

"తనుకూడా వాటిని పట్టుకుంటే?"

ఏదో ఆలోచన తట్టినవాడిలా ఒక్కసారిగా లేచి నుంచున్నాడు గోపీ!

ప్రయత్నించి, ప్రయత్నించి చివరికేలాగైతే నేం బుట్టలోంచి బయటకు పడిందొక చేత.

చిరకాలంగా అనుభవిస్తున్న బానిసత్వపుబాధల నుంచి తప్పించుకొన్న మానవుడు స్వస్థలం చేరుకోబోయేముందు పొందే ఆనందంకన్న ఎన్నోరెట్లు గుణాతీతమైన సౌఖ్యం అనుభవిస్తోందా జీవి తన కుప్పిగంతుల మూలంగా! నేలపై బ్రతకడం బాధాకరమే కావచ్చు—కాని—బంధం నుండి తప్పించుకోవడం ఎంత అదృష్టం?

పట్టుకున్న గాలం అలాగే ఒడ్డున పెట్టి, చేపను తిరిగి పట్టడానికి లేచి నుంచున్నాడా బెస్తవాడు. లేచినుంచున్నవాడల్లా ఒక్కసారి ముందుకు చూశాడు. ఎదురుగ్గా సరిగ్గా పదేళ్లయినా లేని ఓ అబ్బాయి!

ఆ అబ్బాయి తదేకంగా ఎగుర్తోన్న ఆ చేప వంకే చూస్తున్నాడు. చేప యెగురుకుంటూ యెగురుకుంటూ వెళ్ళి మెల్లగా చల్లగా తన స్వస్థలం తిరిగి చేరుకొన్నది. ఇంకొకచేప బుట్టలోంచి బయట పడడానికి తన శక్తికొద్దీప్రయత్నిస్తున్నది. ఆ బెస్తవాడు ఏమనుకున్నాడో ఏమో తటాలున వెళ్లి ఆ బుట్టమూత వేసేశాడు. ఆ బుట్టకు మరింతదగ్గరగా జరిగి కూర్చున్నాడు. మళ్లీ యథాప్రకారంగా గాలం ఆడిస్తూ తనపనిలో నిమగ్నుడైనాడు.

అంతా నిశ్శబ్దం! ప్రకృతి ప్రశాంతంగా వుంది.

పక్షులేవీ పైన విహరించటల్లేదు. పశువులేవీ క్రింద చరించటల్లేదు. ఎఱ్ఱ గన్నేరు పూవులా వున్న సూర్యుడు కాస్తా దూరంగా ఎక్కడో దాక్కోడానికి ప్రయత్నిస్తున్నాడు.

గోపీకేమీ దోచటల్లేదు.

గాలిపటం వుంటే ఏంచక్కా సాయంకాలం పూటదాని నెగరేసుకోవచ్చు! గోలీ కాయలు, బిళ్ళంగోడు, కోతికొమ్మచ్చి. అబ్బ! యెన్ని ఆటలు తామాడేవారు ప్రతిరోజూ! మరి ఇవ్వాళ ఒక్కరూ రారేం?"

"ఛీ! దరిద్రపు వెధవలు!" రానందుకు తన కసినంతా ఈ తిట్టుమూలంగా బయలుపరిచాడు గోపి. కానీ ఇది వినడానికెవరూ అక్కడ లేరు.

బెస్తవాడొక్కసారి పిల్లవాడివేపు చూసి తిరిగి తనపనిలో నిమగ్నుడైనాడు. గోపీకేమీ తోచటల్లేదు. "ఏం చేయాలా?" అని ఆలోచిస్తున్నాడు. ఆలోచిస్తున్నవాడల్లా రెండడుగులు ముందుకు వేసి బుట్టదగ్గరకు చేరుకొన్నాడు. బుట్టకు అక్కడక్కడా చిల్లులున్నాయి. ఆ చిల్లుల్లోకుండా లోపల చేపలెంత బాధపడుతోందీ స్పష్టంగా కన్పిస్తోంది.

అసలు మూతనే తీసేస్తే? ఇంకా బాగా చూడవచ్చుగా! కావాలంటే ఒకటిరెండింటిని పట్టుకోనూ పట్టకోవచ్చు!"

ఆహారాన్వేషణలో నిమగ్నమైన బెస్తవాని నేత్రాలకు ఏవో రెండు మృదుహస్తాలు తమప్రక్కప్రక్కగా జీరాడుతున్నట్లు గోచరించింది. మానవలోకంలో వసిస్తున్న ఆ బెస్తవాని దృగ్రేఖలు బాహ్యంలోకి తటాలున తమమార్గాన్ని మరలించాయి.

ప్రక్కకు బుట్టమీదకు చూపుక్కలు నిగుడించాడు బెస్తవాడు. కానీ...బుట్టకు మూతలేందే?

ఏమైంది?

మూతతోబాటే బయటపడిన ఒకటి రెండు జలచరాలు ఒక్కసారిగా లభించిన స్వాతంత్ర్యంతో ఉక్కిరిబిక్కిరై బాధపడుతున్నాయి

తోటివారి ఆనందంచూచి ఓర్వలేని మరో రెండు వాటి సహచరులు బుట్టను, ఒక మూలకుపోయి అలిగి పడుకున్నాయి!

కొందరు అతి సంతోషంతో వొళ్లుమఱచి ఆనందిస్తుంటే మరికొందరు అతి దుఃఖంతో నిర్జీవులై పడివుండడం లోకచిత్రం కాబోలు!

బెస్తవాడి గుండెలు ఒక్కసారిగా స్తంభించినంత పనైంది.

చేత్తో పట్టుకున్న గాలం అదాటున అలాగే వొదిలేశాడు అతడు.

తను ఉదయంనుండి సంపాదించిన ఆహారం అది! కష్టించి కళ్ళల్లో నొత్తులు వేసుకు సంపాదించిన ఆహారం అది!"

దాదాపు ఏడుపు వచ్చినంతయింది బెస్తవానిపని.

ఇంతకూ మూత దీసిందెవరు? తన నోటివద్దనున్న ఆహారాన్ని నేలపాలు చేయవలసినంతటి కక్ష ఎవరికి కలుగజేశాడు తను?

అసలే ఎఱ్ఱనైన అతని కండ్లు మరింత ఎఱ్ఱనైనాయి.

రెప్పవాల్చకుండా "మూత తీసిందెవరా?" అని నాల్గువేపులనూ తన ఎఱ్ఱని దృష్టిని పరపించాడా బెస్తవాడు.

దూరంగా నీటిలో పడబోయే చేపను పట్టుకోటానికి ప్రయత్నిస్తున్నాడు.

పదేళ్లైనా లేని ఓ అబ్బాయి!

ఆ అబ్బాయే కారకుడా దీనికి? ఏమో! ఎవరికి తెలుసు?

బెస్తవాడు అడుగులో అడుగు వేసుకుంటూ ఆ అబ్బాయిదగ్గరకు వెళ్లాడు.

వెళ్లి అతనికి వెనగ్గా నుంచున్నాడు.

కానీ గోపీ ఇదేమీ చూడడంలేదు. ఒడ్డునున్న చేపనీటిలో పట్టానికి చేసే ప్రయత్నం అతనికి అత్యంత ఆహ్లాదం కల్గిస్తోంది.

ఆ పిల్లవాణ్ని ఏమని సంబోధించాలి? సందిగ్ధంలో తటపటాయించాడు కొద్దిసేపు బెస్తవాడు. "అయినా అబ్బాయ్ అని పిలిస్తే ఏం?"

"అబ్బాయ్!" గొంతులోని మార్దవాన్నంతా మాటల్లో చిలికించాలని వీలైనంత మృదువుగా సంబోధించాడు పిల్లవాణ్ని బెస్తవాడు.

తుక్కురకం రైలింజను కూసినంత శబ్దం తన వెనగ్గా వినిపించేసరికి ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు పదేళ్లైనా లేని గోపీ!

ఉలిక్కిపడి అకస్మాత్తుగా వెనక్కు తిరగడంలో ఒడ్డునున్న కుడికాలు కొస్తా జారి ప్రక్కనున్న నీళ్లల్లో పడింది.

చిన్ననాటినుండి తోడునీడగా వుంటున్న సహచరి నీళ్ళలో పడగానే తను మాత్రం వుండి ఏం చేయాలి? అని విచారంతో ఎడమకాలు గూడా నీటిలో ప్రవేశించింది. ముందుకు నేలమీదకు అడుగు వేయబోయిన గోపీ. వెనక్కు నీళ్ళల్లోకి దభేలుమని పడ్డాడు.

పడ్తూనే భయంతో అతని మెదడు దిమ్మరి పోయింది.

అవ్యక్తావస్థలోవున్న అతనిలో ప్రపంచం సుడులు సుడులుగా తిరుగుతోంది.

అతనికి తెలీకుండానే "అమ్మో!" అన్న స్వర మొక్కటి అతని నోటినుండిబయటి ప్రపంచానికి వినిపించింది.

బెస్తవాని కిదంతా అయోమయంగా వుంది.

ఇదేమిటి? అబ్బాయీ—అని తను ఎంతో ఇదిగా పిలిస్తే భయపడి ఒక్కసారిగా అలా నీళ్ళల్లో పడ్డాడేం?"

బెస్తవానికి ఏం చేయటానికీ కాళ్ళూ చేతులూ—ఆడడం లేదు.

పిల్లవాడు పడిన ప్రదేశం చుట్టూ నీరు గిరగిరా తిరుగుతూ ముద్దులొల్కే ఆ అబ్బాయిని తమ చేతులతో కౌగలించుకొని ఆట గృహంలోకి పిలుచుకు పోతున్నాయి.

అంతకంతకూ పిల్లవాడు లోలోనకు నీటిలోకి వెళ్ళిపోతున్నాడు.

బెస్తవానిలో అకస్మాత్తుగా ఓ వింత భయం కలిగింది. "ఆ అబ్బాయి మునిగిపోతున్నాడు. అతనే చనిపోతే...వాళ్ళ వాళ్ళు ఎంతగా దుఃఖిస్తారో!"

జాలితో నిండిన బెస్తవాని హృదయంలో చలనం కల్గిందీ భావంతో.

నరనరాలకు ప్రాకిన ఆ చలనం అతనిలో ఉత్తేజం కల్గించింది. ఉద్రేకానికి ఊతనిచ్చింది.

పెల్లుబికిన ఉత్సాహోద్రేకాలతో ముందువెనుకలాలోచించకుండా నీటిలో దూకేశాడా బెస్తవాడు.

నీటి యీత బెస్తవారికి కొట్టిన పిండి.

నీటి మధ్యన రెండు చేతులు బెస్తవాని కంఠాన్ని గట్టిగా పట్టుకుని ఊపిరాడకుండా మరీ మరీ నొక్కుతున్నాయి.

గోపీ జుత్తు చేత్తో పట్టుకున్న బెస్తవాడు ఏలా ఒడ్డుకు చేరాడో అతనికే తెలీదు. అప్పటికి చీకటి పోయి మెలమెల్లగా వెన్నెల తన అధికారాన్ని సంపాయించుకొంటున్నది.

చల్లగావున్న పిల్లగాలి ప్రకృతి నంతటినీ స్పృశించి ఆనందాన్ననుభవిస్తున్నది.

పిన్నలు : పెద్దలు

బరువుగా వున్న కనురెప్పలను అతికష్టంమీద విప్పి పరిసరాలను చూడగలిగాడు గోపీ!

గోపీ తల తనతొడపై పెట్టుకుని కూర్చున్న బెస్త వాడు ఆత్రుతగా, భయం భయంగా ముద్దు ముద్దుగా ఆ పిల్లవాడి కళ్ళల్లోకి చూస్తున్నాడు.

పిల్లవాడు చలికి గజగజా వణకుతున్నాడు.

వణకుతున్న ఆ పిల్లవాడు కదులుతున్న ఓ కాంతి రేఖలా కనుపించాడు బెస్తవాడి కంటికి

మొద్దుబారిన తన హస్తాలతో అ మృదు శరీరాన్ని మెల్లగా నిమిరాడు అతడు.

గోపీ ఆలోచిస్తున్నాడు. "తనెందుకు నీళ్ళల్లో పడ్డానా అని? కాలు జారింది. అది తనకు బాగా జ్ఞాపకం వుంది. మరి ఉత్త పుణ్యానికి కాలెందుకు జారుతుంది.

ఇవ్వాళ బళ్ళో మాష్టారు చెప్పారు కూడా! ఏది జరగాలన్నా ఏదో ఒక కారణం వుండాలట

మాష్టారనేసరికి మళ్ళీ జరిగిందంతా జ్ఞాపకం వచ్చింది గోపీకి!

"తను మాష్టారు మీద కసి తీర్చుకోవాలనుకున్నాడు. మరి నీళ్ళలో ఎందుకు పడ్డాడు?"

ఎదురుగా వున్న బెస్తవాడు అదేపనిగా గోపీ వేపు చూస్తున్నాడు.

గోపీ మళ్ళీ ఆలోచించడం మొదలెట్టాడు. "ప్రొద్దున తను మాష్టారు మీద కోపంతో క్లాసునుంచి పారిపోయి వచ్చాడు. ఆ కోపంతో తను అన్నానికి కూడా ఇంటికి పోలేదు పాపం! తన అక్కయ్య ఇంటిదగ్గర తనకోసం ఎదురు చూస్తుంటుంది కాబోలు!

పుచ్చపువ్వులా వున్న ఆ వెన్నెట్లో నల్లచీర కట్టుకున్న ఓ తెల్లమ్మాయి చెఱువుగట్టు వెంబడే పరిసరాలు పరికిస్తూ రావడం చూచాయగా కనుపించింది పడుకుని ఆలోచిస్తున్న గోపీకి.

చెఱువుగట్టు ప్రక్కనున్న జువ్వి చెట్టు క్రిందగా ఓ క్షణం సేపు నిల్చుంది, ఆ అమ్మాయి, బడలిక తీర్చుకొంటున్నట్లుగా.

అయినా చెట్టు కొమ్మల మధ్యగా తెల్లని వెలుగులామెమీద పడ్తూనే వున్నాయి

నల్లచీర నిగనిగ మెఱుస్తూ, ముఖపద్మం మరింత ధవళంగా వుండనే వుంది.

పడుకున్నని ఆలోచనలతో కొట్టుమిట్టాడుతున్న గోపీ ఒక్కసారిగా అదాటున లేచి నుంచున్నాడు.

తడితడిగా వున్న అతని బట్టల్లోంచి బొట్లు బొట్లుగా పడుతోంది నీరు. అలల మీదుగా వస్తున్న చల్లగాలి అతని శరీరాన్ని దూసుకుపోతోంది. కానీ ఆ నల్లచీర వేపే చూస్తున్నాడు గోపీ!

ఆవిడ మెల్లగా అడుగులో అడుగేసుకుంటూ వీళ్ళ వేపే వస్తోంది.

దగ్గర దగ్గరగా వచ్చిన ఆమెను చూచాడు గోపీ. అమ్మో!తన అక్కయ్య! ప్రత్యణువునా కంపించిపోయాడు పదేళ్ళైనా లేని గోపి.

గోపీ వేపు చూస్తున్న బెస్త మనిషి 'ఏమిటా?' అని ఒక లిప్తకాలం ఆ వస్తున్న ఆగంతుకురాలి వైపు తన దృష్టిని మరలించాడు.

దీనురాలుగా కనిపించింది తగాడికామె.

"ఇక్కడేంపనీ గొప్పింటి బిడ్డకు?" అనుకున్నాడతడు మనసులోనే. అయినా సమాధానం మాత్రం శూన్యం.

"ఇటేమైనా మా తమ్ముడు వచ్చాడా?" మార్దవంగా సుతిమెత్తని స్వరంతో సన్నగా పలికిన పలుకు విని బెస్తవాడు చుట్టుపట్ల చూచాడు గోపీ కోసం. ఏడీ గోపీ?

"ఏమిట్రోయ్ అలా దిక్కులు చూస్తావు మా తమ్ముడేడంటూంటే?" మళ్ళీ అదే కంఠం కాస్త కోపం రంగరించిన హుందాతనంతో ప్రశ్నించింది.

బెస్తవాడు మళ్ళీ చుట్టు ప్రక్కల గాలించాడు. ఏడీ గోపీ?

బెస్తవాడికో నాలుగు గజాల దూరంలో మఱ్ఱి చెట్టు ఒకటి వేయి ఊడలతో వంగిపోయి బ్రతుకుతోంది.

"నిన్ను కాదుట్రోయి అడుగుతోంది?" దెబ్బ తిన్న అహం మూలంగా, ఉప్పొంగిన కోపంతో పెద్దగా ప్రశ్నించిందామె.

ఎవరో ఏమిటో అడుగుతున్నారని అయోమయావస్థలోనుండి జాగృతిలోకడుగెట్టిన బెస్తవాడు ఒక్కసారి ఆ ఆగంతకురాలి మొహంలోకి చూచి "మీ పేరేంటి బుల్లొమ్మగోరూ!" అన్నాడు నమ్రతగా.

ఆబిడకు మహా చిరాకేసింది. కోపం ముంచు కొచ్చింది. "ఏమిటీ చొప్పనంటు ప్రశ్నలు?" విసు క్కున్నదామె తనలో తానే.

"నా పేరేదైతే నీకేం?" ఆమె పలుకులు విని రెండు చేతులూ జోడించి వినయం వుట్టి పడేటట్లుగా జవాబిచ్చాడు బెస్తవాడు. "ఆ బాబును కొట్టబోకం డమ్మగోరూ! ఎంతో ముద్దొస్తారు!"

ఆవిడ నవ్వకుండా వుండలేక పోయింది. నవ్వు తూనే జవాబిచ్చింది.

"అసలెవరోయ్ ఆ బాబు! మా గోపీకోసం నే వెతుకుతుంటేను."

ఆమె జవాబు పూర్తిగా వినకుండానే బెస్త వాడు మర్రిచెట్టు దగ్గరకు పరుగెత్తాడు.

చెట్టు కుదుట్లో వణుకుతూ నిలబడిన గోపీని సందిట్లో ఇముడ్చుకున్నాడు. ఒక్క పరుగున మరలా యథాస్థానం చేరుకొన్నాడు.

గోపీని ఒకప్రక్క చలిబాధా, మరోప్రక్క భయమూ బాధిస్తున్నాయి.

అతను మాట్లాడనూలేదు పరుగెత్తనూలేదు.

అలాగే శిలాప్రతిమలా నిలబడ్డాడు.

ఆమె గోపీ కండ్లలోకి సూటిగా తీక్షణంగా చూచింది. గోపీ తల దించుకున్నాడు.

ఆమె గోపీ చెయ్యి పట్టుకుని ముందు నడవడం ప్రారంభించింది. తప్పించుకు పోవటానికాకుఱ్ఱ వాడు ప్రయత్నం చేయలేదు.

"ఈడకొస్తారా బాబుగోరూ మళ్లీ రేపటి కిమ్మొల్టికి?" బెస్తవాడు కోరిన కోర్కెకు వెనుకకు తిరిగిచూచాడు గోపీ!

అతని కళ్ళనుండి రెండు పసిడి ముత్యాలు రాలి చొక్కామీద పడ్డాయి.

గాలి తాకిడికి తట్టుకోలేని మేఘంవలె బాధ పడ్డాడు గోపీ!

"పెద్దింటోళ్లు యేడవగోడ్దు బాబూ!" బెస్తవాడి స్వరం గోపీకి వినిపించకుండానే గాలిలో కలసిపో యింది.

ముందు పోతున్నామె అడుగుల్లో అడుగేస్తూ; వెనకకు చూచి చూచి నడుస్తున్న గోపివేపు చూస్తూ— ఆలానే నిలబడిపోయాడా బెస్తవాడు చెలువుగట్టున. చంద్రబింబం మబ్బులు చాటుకు వెళ్ళింది కూడా గుర్తించకుండా!

* * *

ఆమె కండ్లు విస్ఫులింగాల్ని వెలిగ్రక్కు తున్నాయి.

ఆమె అంటున్న ప్రతీమాటా గాలిలో కలసి పోతూ, గోపీ చెవుల్లో ములుకులు నాటులోంది.

"వెధవాయ! చేపలవాళ్ళతోనట్రా ఆటపాటలు, చదువు సంధ్యలు మానేసి?"

గోపీ కంతా అయోమయంగా వుంది. "చేపల వాళ్లకూ తనకూ భేదమేమిటో!"

అందమైన మొగంనుండి చిలిపి చూపులు చూచే అతని కండ్లు ప్రశ్నార్థకంగా చూసాయి లక్ష్మివేపు.

జవాబీయకుండా శిలాప్రతిమలా నుంచున్న తమ్ముణ్ని చూసేసరికి కోపం పెచ్చు పెరిగింది లక్ష్మిలో.

"ఎంత నిర్లక్ష్యం ఈ రాలుగాయుకు?" అను కొన్నదామె మనసులో.

మనసులోవున్న భావాన్ని చేతల్లో వెలువరించే వఱకూ నిలువరించుకోలేక పోయిందామె.

అమాయకుడైన ఆ చిన్నవాణ్ణి కొట్టకుండా వుండలేకపోయింది లక్ష్మి.

ముట్టుకుంటే కందిపోయే అతని పాలబుగ్గలపై ఆమె అయిదువ్రేళ్లి ముద్రలు స్పష్టంగా పడ్డాయి.

ఎఱ్ఱనైన అతని శరీరంమీద నల్లని చారలు ప్రత్య క్షంగా కనిపించాయి. చెవులు—కళ్లు—బుగ్గలు— అన్నీ బాధతో కంపించాయి.

పసేళ్లైనాలేని గోపి నిట్టనిలువునా బాధతో కంపించిపోయాడు.

"అక్కయ్యా! అక్కయ్యా!" ఇక ఎప్పుడూ వాళ్ళతో తిరగనక్కయ్యా!"

బాధగా జాలిగా వ్యధగా విలపించాడు గోపీ!

అతని హృదంతరాళ్లోనుంచి వెలువడిన ఆర్త నాద మది.

లతలా, లక్ష్మిపాదాలు చుట్టుకుపోయాడు గోపి, కొట్టవద్దన్నట్లుగా!

నిరవధిగా ప్రవహిస్తున్న అతని కన్నీరు లక్ష్మి పాదాల నభిషేకం చేసింది.

శరణన్నట్లుగా తనపాదాలపై వున్న తమ్ముడి వేపు చూచింది లక్ష్మి.

ఎంతైనా ఆమెది స్త్రీ హృదయం.

స్త్రీలు సామాన్యంగా ప్రేమ ప్రపూర్ణలు.

అకస్మాత్తుగా వంగి తన బాహువల్లరిలో పొదువుకున్న దామె తన తమ్ముణ్ణి.

"తమ్ముడూ! మనం బీదవాళ్ళం కదా! అమ్మా నాన్నా కూడా లేరా? నువుకూడా ఇలా అల్లరిచేస్తే ఎలా చెప్పు? నునుచేత గోపీ చెంపలు సవరిస్తూ పలికిం దామె యీ పలుకులు.

లక్ష్మి పరిష్వంగంలో మాతృత్వంలోని వెచ్చదనా న్ననుభవిస్తున్నాడు గోపి! ఆ వెచ్చదనంలో కోలుపోయిన ధైర్యాన్నంతా కూడగట్టుకోం టున్నా డతడు. అణగారిన అతని శక్తులన్నీ అప్పుడప్పుడే తిరిగి తమ సహజత్వాన్ని సాధించుకుంటున్నాయి.

"మాస్టరుగారిని అలా తిట్టవచ్చా చెప్పుబాబూ!" తను చేసిన తప్పిదానికి సిగ్గుపడుతూ అడిగింది లక్ష్మి.

తనెంతగా హింసించినా, బాధనంతా ఒక్క క్షణంలో మరిచిపోయి, తనవేపు బరువుచూపులు చూచే తమ్ముణ్ణి చూసేసరికి ఆమెహృదయం కలగుండు పడింది.

గోపి, లక్ష్మి కళ్ళల్లోకి చూస్తూ నిర్మలంగా నవ్వాడు.

ఆ నవ్వులో ఎన్ని ధవళవీచికలు వీచాయి!

"మరెందుకు నన్ను ఉట్టిపుణ్యానికి కొట్టాలేం?"

"అసలేం జరిగింది తమ్ముడూ?" విషయాన్ని తెలుసుకుందా మన్న కుతూహలంతో తమ్ముణ్ణి మరింతగా దగ్గరకు లాక్కుంది లక్ష్మి.

గోపీ గునుస్తూ గారాబంగా జవాబిచ్చాడు. "మరేం—మాష్టరుగారి పెద్దబ్బాయి లేడూ—వాడే నన్ను తిట్టాడే—నేనేమో కొట్టానే—అప్పుడు మాష్టారేంచేయాలి చెప్పు?"

లక్ష్మికి సంగతంతా కొద్దికొద్దిగా అర్థమైంది.

"మరి నశ్యం పంతులుగారలా చెప్పారేం?" విడరాని వ్యూహాన్ని ఛేదించాలని తనకుతానే ప్రశ్నను వేసుకొన్నది లక్ష్మి. "ఆడకూడని దుర్భాషలాడాడుట గోపీ! బడికి పంగనామాలు చుట్టి రోజల్లా చేపల వాళ్ళతో తిరుగుతూంటాడట గోపీ!" లక్ష్మి వళ్ళు ఒక్కసారిగా జలదరించింది.

"అమ్మో! తన తమ్ముడు చెడిపోతున్నాడు. వాడే తన ఏకుగడకు జీవనాధారం. వాడేలేకపోతే తన బ్రతుకు—?"

ఎంత నిస్సారంగా ఉంటుందో ఊహించుకో లేకపోయింది లక్ష్మి.

ఆలోచనల పరధ్యానంలో మునిగిపోయిం దామె తమ్ముణ్ణి చూస్తూ.

గోపీ అర్థంకాని చూపులతో లక్ష్మివేపు అలానే చూస్తుండి పోయాడు.

"ఏమిటీ ఒక్కసారి అలా అయిపోయిందేం తన అక్కయ్య? తనేమైనా తప్పపని చేశాడా?"

గోపీకి అర్థంకాలేదు తన అపరాధం.

ఇంతలో వెంకటాచార్లు లోపల కడుగెట్టాడు.

అతను ఆ వూళ్ళో బడిపిల్లలపాలిటి సింహ స్వప్నం.

ఆ ఊళ్లో ఉన్నది ఒక్కటే బడి. ఆ బళ్ళో ఉన్నది ఒక్కడే మాష్టారు. అతడే శ్రీమాన్ వెంకటా చార్లు ఉరఫ్ నశ్యంపంతులుగారు.

సమయంకాని సమయంలో ఆయ నక్కడకు రావడం భయపు టూహాలు రేపింది గోపీ మనస్సులో.

తనను బహుశా కొట్టటానికే వచ్చివుంటాడని ఊహించుకోటానికి ఎంతో కాలం పట్టలేదు గోపీకి.

మాష్టారును చూసి, అభివాదంచేసి తుంగచాప వేసింది లక్ష్మి.

ఆయన కూర్చోలేదు. అలానే నిల్చుండి పోయాడు.

"గోపీ ఇంటికొచ్చాడా లక్ష్మీ!" అన్నమాటలు విని "ఆ! ఆ! వచ్చాడండీ!" అన్నదామె అసలు సంగతేమిటో అర్థంకాకుండా.

"ఏడీవాడు?" మళ్ళీ ఆయనే ప్రశ్నించాడు కూర్చొనకుండానే.

లక్ష్మి చుట్టు ప్రక్కల చూచింది. గోపీలేదు.

వంటింట్లో ఏదో చప్పుడైంది.

మళ్ళీ శ్రీమాన్ ఆచార్లుగారే అంటున్నాడు: "అమ్మాయ్! మధ్యాహ్నం నీకు చెప్పానా వాడు బళ్ళోనుంచి పారిపోయాడని!" అవునని తలూపింది లక్ష్మి. "వాడొక్క చేపలు పట్టడమే కాదట నేర్పుకొంటూంది. ఈతలు కొట్టడం కూడానట!"

"ఏమిటీ?" అన్నట్లు ఆశ్చర్యంగా తలెత్తి మాష్టారి వేపు చూచింది లక్ష్మి.

"మా అబ్బాయి చూశాడుట — మీ వాడూ బెస్తవాడూ కలిసి చెఱువులో ఈతలు కొట్టుండడం." మాష్టరుగారు తనధోరణిలో తను చెప్పుకుపోతున్నాడు "నీకు తెలుసుకదూ ఆ చెఱువులో దిగిన మహామహా గజయీతగాళ్ళే మళ్ళీ లోకం మొహం చూడలేదని."

ఆ మాట విన్న లక్ష్మి గబగబా వంటింట్లోకి పరుగెత్తింది.

ఓ మూలగా గోడకంటుకుపోయి నిలబడి వున్నాడు గోపీ!

ఆ కుఱ్ఱవాణ్ణిమాచి, అతని మనస్సులో ఎంత సంఘర్షణ జరుగుతోందో తెలుసుకోవడం ఎవరికైనా కష్టం కాదు.

వణకిపోతున్న గోపీని వాటంగా ఓ చేత్తో పట్టుకుని సావిట్లోకి తీసుకొచ్చింది లక్ష్మి.

"ఎందుకు బళ్ళోనుంచి పారిపొయ్యావు?" గర్జించాడా బడిపంతులు.

గోపీ జవాబు చెప్పలేదు తలవంచుకుని అలాగే నిలబడ్డాడు.

"పంతులుగారడిగినదానికి సవ్యంగా జవాబు చెప్పవేరా?"

కోపంగా అడిగిన లక్ష్మివేపు దీనంగా చూచాడు గోపి!

"అమ్మాయ్! వీడు మరీ బరితెగిపోయాడు ఏలా కాపాడుకొంటావో?"

లక్ష్మి కీసూచన చేసి వెనక్కు మరలాడా బడిపంతులు.

అసలెందులకు వచ్చినట్టు? ఎక్కడకు వెళ్తున్నట్టు?

సామాన్యంగా బడిపంతుళ్ళకు మఱపు సహజమట.

తన కొంగుపట్టుకు నుంచున్న గోపినిచూచి కోపం పొంగి పొరలింది లక్ష్మికి.

'వెధవ వినయాలూ, వీడూనూ!' అనుకొన్నదామె.

బెరుకు బెరుగ్గా చూస్తున్నాడు లక్ష్మివేపు గోపీ!

"అలుసిచ్చినకొద్దీ మరింత మితిమీరుతున్నాడు వీడు!" ఆమెలో కఱకుదనం మెలమెల్లగా ప్రవేశిస్తోంది.

ఏంచేయటానికీ తోచని గోపి అక్కవేపు చూడడానికి భయపడి తలదించుకొన్నాడు.

"మొక్కయి వంగనిది మ్రానయిన తర్వాత అసలు వంగదట!" పూర్వులు చెప్పిన సుభాషితం ఆమె ఆలోచనలకు విశ్రాంతిలేకుండా వేధించుకుతిన్నది.

"గోపీ!" లక్ష్మి పిలిచిన పిలుపుకు ఆ కుఱ్ఱవాడు అదిరిపడ్డాడు.

గోపీని తీసుకుని ఆమె బయటకు వచ్చింది.

అక్కడక్కడావున్న నక్షత్రాలు పేలవంగా ఏడుస్తున్నట్లున్నాయి.

చంద్రుడు పూర్తిగా మబ్బుల చాటుకు వెళ్ళిపోయాడు. బహుశా లోకంలో జరిగే దారుణ సంఘటనలు చూట్టానికిష్టంలేకేమో!

గోపీ వికృతంగా తలలూపుతున్న చెట్లను చూచి గట్టిగా కళ్ళు మూసుకున్నాడు.

"అక్కయ్యా!" అంటూ మెల్లిగా ప్రక్కలకు చూచాడు.

కానీ అతని అక్కయ్య అక్కడలేదు.

భయపడి తొట్రుపాటుతో ఇంట్లోకి పరుగెత్తబోయాడు.

కానీ తలుపులు రెండూ అతని కెదురుగా మూసుకుపోయాయి.

"అక్కయ్యా!" అంటూ అదేపనిగా అతడు గొంతు చించుకుని విలపించాడు.

కానీ లక్ష్మి తలుపు తీయలేదు. ప్రశాంతంగా జవాబు నిచ్చింది. "బడినుంచి పారిపోయిన ఫలితమిది!" అని.

ప్రక్కన దూరంగావున్న చెట్లకు ఆవల నక్కలు ఏడుస్తున్నాయి

గోపీకి నక్కలంటే అమిత భయం! అవి మనుష్యుల్నే తినేస్తాయట!"

లోపలనుంచి మళ్ళీ లక్ష్మి స్వరం వినవచ్చింది. "ఏం చెరువులో ఈతలాడేంత బాగాలేదా బయట?"

నిస్సహాయుడైన గోపీ, నీరసించి చతికిలబడ్డాడు అరుగుమీద.

* * * *

తలుపులు మూసినా వీస్తోంది గాలి చాలా తీవ్రంగా.

బయటనుంచి వెక్కి వెక్కి ఏడుస్తున్న స్వరం వినవస్తోనే వుంది.

అయినా లక్ష్మి వెచ్చగావున్న గదిలో నిశ్చలంగా కూర్చుని ఆలోచించుకొంటోంది. "తానేమైనా తప్పుచేశానా?" అని.

ప్రక్కనున్న వెంకటటింటివారి గడియారం, గంటలు కొట్టడం అస్పష్టంగా విన్పించింది ఆలోచించుకొంటున్న లక్ష్మికి.

"బహుశా పదేమో!" అనుకొన్నదామె ఆలోచించుకొంటూనే.

జీవన్మరణాలలో కుస్తీపడుతోన్న దీపం మరణానికి చేరువవు పోతోంది.

దీపం ఆరిపోబోతుండడం చూచి, లేచి వెళ్లి పెద్దది చేసింది వత్తిని ఆమె.

కానీ గదిలో కొన్ని మూలల్లో అంధకారం పోనేలేదు.

ఆమెలోనూ కొన్నిచోట్ల చీకటి సందేహాలు తలలెత్తి అరుస్తూనే వున్నాయి.

బయటనుండి వినవస్తున్న విషాదస్వరం అంతకంతకూ తగ్గుతోండడం చూచి "నిద్రపోతున్నాడేమో!" అనుకొని తలుపు తీయబోయింది లక్ష్మి.

కానీ ఆగిపోయింది. ఆలాగే మంచంమీద కూర్చొని ఆలోచించుకొంటోంది.

"కుఱ్ఱవాణ్ని అంతగా శిక్షించడం అన్యాయమేమో!"

"కాదన్నాయి" ఆమెలోని అంతర్గత భావాలు.

"ఓ రాత్రి బయట పడుకుంటే వచ్చిన నష్టమేం లెద్దూ!" అన్నారెవరో ఆమెలో దాక్కున్నవారు.

ఆరుబయట తీతువుపిట్ట కూస్తూ వెళ్ళిపోయింది.

నక్కల అరుపులు తగ్గినా అప్పుడప్పుడు వినిపిస్తూనే వున్నాయి.

ఏవో రెండు మూడు గ్రామసింహాలు గోపీ దగ్గరకొచ్చి దూరంగానుంచుని కాసేపుచూచి తిరిగి వెళ్ళిపోయాయి

గోపీకి నక్కలన్నా కుక్కలన్నా అమితభయం!

కుక్కలు కరిస్తే మనుషులు బ్రతికరట!నక్కలు మనుషుల్నే తింటాయట!

అదీగాక నక్కలూ కుక్కలూ భార్యాభర్తలుగా! తన అక్కయ్య ఎప్పుడో చెప్పింది. ఎండా వానా కుక్కల నక్కల పెళ్ళి అని!

గోపీ నిలువునా వణకిపోయాడు.

'అమ్మో! తనను తినవుకదా!'

ఎక్కడన్నా దాక్కోవాలనుకున్నాడు గోపి.

దూరంగా రెండు మూడు ఇళ్ళ కవతల ఓ చీకటి ప్రదేశం వుంది.

'అక్కడకు వేళ్తే తను నక్కలకూ కుక్కలకు కనబడడు.'

ఆ వేపు చూచాడు గోపీ!

కానీ అదేమిటీ! ఆ చీకట్లో కొఱివి దయ్యాలేవో నాట్యం చేస్తున్నట్లున్నాయి. గట్టిగా కళ్ళు మూసుకున్నాడు గోపీ!

'ఆ బెస్తవాడన్నా రాడేం? అయినా ఆ బెస్తవాడి వొళ్ళో పడుకుంటే ఎంత హాయిగా వుండీ!"

మనసు నావరించిన భయంతో నిద్రపోలేకపోయాడు గోపి!

ఆలోచనల పరధ్యానంలో ఆలాగే కన్ను మూసింది లక్ష్మి.

బయట కీచురాళ్ళ ధ్వనులు మాత్రం మిక్కుటంగా వినవస్తున్నాయి.

మేఘాల్లోంచి రెండు మూడు నక్షత్రాలు తొంగి తొంగి చూస్తున్నాయి.

వేగు చుక్క కాబోలు గోపిని చూసి పరిహసించి వింతగా వెలిగింది.

వేగు చుక్కను చూచి కుక్కుటం అఱచింది.

కోడి చేసిన వేకువ సద్దుతో నిద్ర పోతున్న లక్ష్మి అదాటున లేచి, చీర సర్దుకుని యదాలాపంగా ప్రక్క మంచం కేసి పరికించింది

కానీ గోపీ అక్కడెందుకుంటాడు?

ప్రక్కనున్న వారి గడియారం మూడు కొట్టడం స్పష్టంగా వినిపించింది లక్ష్మికి.

"అయ్యో! గోపీ బయటనే వుండిపోయాడా?" ఆందోళన ఆదుర్దాలతో ఒక్కసారిగా తలుపు తెఱచి బయటకు తొంగి చూచింది లక్ష్మి.

కానీ వెన్నెల తీవలు మాత్రమే ఆమెకక్కడ కనుపించాయి

ఏ అరుగుమీద గోపీ నిద్రపోతుంటాడని ఆశించిందో ఆ ప్రదేశంలో అతగాడు లేడు.

లక్ష్మిలో ఒక్కసారిగా విషాదం పెల్లుబికింది. కన్నీరు కట్టలు త్రెంచుకు ప్రవహించింది. "తనే గోపీని తనకు కాకుండా చేసుకుంది. నేరానికి మీరిన శిక్షను విధించింది."

కారుతున్న కన్నీళ్ళైనా తుడుచుకోకుండా అలాగే చతికిల పడిందామె గడపమీద ఏం చేయాలి? ఎక్కడని వెతకాలి?"

ప్రతీ ప్రశ్న ఆమెలోని అపభ్రంశపు వూహాల్ని రేపి, సైపరాని కష్టాన్ని కల్గించింది.

"ఎందుకమ్మా ఏడుస్తున్నావ్?" తెల్లవారు జామునే పొలానికి పోతున్న ఓ పండు ముసలాయన ఆమెను చూసి జాలిపడి ప్రేమగా పల్కరించాడు.

"మా గోపీ కనుపించడం లేదండీ!" అన్నదామె గాద్గదికంగా.

"అలాగా అమ్మా! అన్నాడాయన సానుభూతి పూర్వకంగా, "కనిపిస్తాడు లేమ్మా. అలా అధైర్యం చెందితే ఏలా చెప్పు?" కరుణతో బుజ్జగించి ఆ ముదివగ్గు ముందుకు రెండడుగులు వేశాడు. కానీ మళ్ళీ వెనక్కు వచ్చి, లక్ష్మినిచూస్తూ "చూడు! అబ్బాయి ఎలా ఉంటాడూ!" అన్నాడు.

లక్ష్మి నీరునిండిన కళ్ళతోనే జవాబిచ్చింది: "అదే ఎఱ్ఱగా వుంటాడు. చిరిగిన లాగూ..."

మధ్యలోనే ఆయనందుకుని "నాకా వివరాలైతే తెలీవుకాని, చూడమ్మా! ఎవరో కుఱ్ఱవాడు ఆ బెస్తవాడలోకి పరుగెత్తుకుంటూ పోవడం కనిపించింది. బహుశా—!"

ఇంకా ఆ ముసలాయన సరిగా జవాబైనా చెప్పలేదు. ఒక్కసారిగా లేచి నుంచుని పిచ్చిదానిలా పరుగెత్తిపోయింది బెస్తపల్లె వేపు లక్ష్మి.

"పిచ్చి పిల్లలు!" ప్రేమతో ఆశీర్వదించి, ఆ యింటి తలుపు దగ్గరగా మూసి ముందుకు సాగిపోయాడా ముసలాయన, తూర్పుదిక్కు ఎఱ్ఱబడడం చూచి.